RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం , 23 - 8 -2026

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

## - కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ నాయకులు



**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి)**

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను కొత్తగూడెం కేంద్రంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, డా. జి.ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా. గడల శ్రీనివాసరావు పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, చిరంజీవి అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మెగాస్టార్ చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో చిత్ర పరిశ్రమలో అంచెలంచెలుగా ఎదిగి మెగాస్టార్‌గా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న చిరంజీవి నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి లక్షలాది మందికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ గొప్ప మానవతావాదిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. చిరంజీవి ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, పవన్ కళ్యాణ్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన 6వ బెటాలియన్ వార్షిక క్రీడా పోటీలు

## విజేతలకు పతకాలు అందజేసిన కమాండెంట్ పి.సి.వి. రమణ



**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

మండల పరిధిలోని చాతకొండలో ఉన్న 6వ బెటాలియన్‌లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026 శనివారం ఘనంగా ముగిసింది. వివిధ క్రీడాంశాల్లో బెటాలియన్ పోలీసు అధికారులు, సిబ్బంది, మినిస్టీరియల్ స్టాఫ్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు.నాలుగు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన వారికి బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ పతకాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. క్రీడలు పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు హెచ్. అబ్దుల్ రషీద్, బి. మరియదాసు, ఏవో సత్యవతి, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, మినిస్టీరియల్ స్టాఫ్, యూనిట్ హాస్పిటల్ సిబ్బంది, పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గణేశుడిని నమ్ముకుంటే అంతా శుభమే

## - కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి



**పాల్వంచ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

గణేశుడిని నమ్ముకుంటే జీవితంలో అంతా శుభమే జరుగుతుందని 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ తూర్పు బజార్‌లో టీమ్ ఎస్ఎన్‌వై యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల పనుల ప్రారంభానికి శనివారం కర్ర పూజ నిర్వహించారు.ప్రముఖ పూజారులు ఆంజనేయ శర్మ, నాని నేతృత్వంలో జరిగిన పూజా కార్యక్రమంలో కార్పొరేటర్ విమలాదేవి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిదేవుడైన గణేశుడు విఘ్నాలను తొలగించే శక్తివంతమైన దేవుడని, భక్తిశ్రద్ధలతో ఆయనను పూజిస్తే చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని తెలిపారు.
గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికప్రముఖులు,భక్తులు పాల్గొన్నారు.

# సాయంత్రంలోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

## - బీఎల్ఓల పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**అచ్చంపేట, ఆగస్టు 22 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని చౌటపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శనివారం సందర్శించారు. గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించిన నోటీసుల పంపిణీ, వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్‌వైజర్‌తో మాట్లాడి పనితీరును సమీక్షించారు. నోటీసులను త్వరితగతిన పంపిణీ చేసి, వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను శనివారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఓ, తహసీల్దార్, ఎంపీడీఓతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన నేత "గడల"..!?

## ఖమ్మం-వరంగల్- నల్గొండ స్థానానికి పోటీకి సిద్ధం

## పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ

**భద్రాద్రి బ్యూరో, ఆగస్టు 22 (తెలంగాణ వాణి)**

జనసేన తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గడల శ్రీనివాసరావు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయడానికి గడల సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. జనసేన పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను ఒక అవకాశంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 3 జిల్లాల్లోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. శాసనమండలి వేదికగా ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు గడలకు అవకాశం కల్పించి ఎన్నికల బరిలో నిలపాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. అయితే గడల శ్రీనివాసరావు రాష్ట్ర వైద్య శాఖలో ఉన్నతాధికారిగా పని చేస్తున్న సమయంలోనే ఆయన రాజకీయాల వైపు మొగ్గు చూపినట్లు ఆయన అభిమానులు ప్రచారం చేసిన విషయం తెలిసిందే. గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ద్వారా రాజకీయాల్లోకి రావాలని ఆసక్తి చూపించగా అందుకు కేసీఆర్ మోకాలు అడ్డుపెట్టిన విషయం అందరికి తెలిసిందే. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గిరిజన ప్రాంతంలో జన్మించిన గడల శ్రీనివాసరావు అన్ని వర్గాల ప్రజలకు



సేవలు అందించాలని లక్ష్యంతో రాజకీయ రంగ ప్రవేశం చేయాలని చూడగా అప్పటి రాజకీయ పరిస్థితి ఆయనకు వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో ఆయన కొంతకాలం మౌనంగా ఉన్నారు. కాగా రాష్ట్ర వైద్య శాఖలో ఉన్నతాధికారిగా పదవి విరమణ చేసిన అనంతరం పూర్తి స్థాయిలో రాజకీయవేత్తగా కొనసాగాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీలో గడల చేరారు. జనసేన పార్టీలో చేరి ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకుడిగా పార్టీలో చురుకుగా పని చేసిన కొద్ది కాలంలో గడల శ్రీనివాసరావును రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా పవన్ కళ్యాణ్ నియమించారు. నాటి నుంచి రాష్ట్రంలో వివిధ జిల్లాల నాయకులతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ప్రచార కార్యక్రమాలు నిర్వహింప చేసేందుకు పార్టీ శ్రేణులను సమయత్వం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రంలో పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల గడువు దగ్గర పడింది. దీంతో గడల శ్రీనివాసరావు ఆ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. అంతటితో ఆగకుండా తన అభిప్రాయాన్ని జనసేన పార్టీ అధిష్టానం వర్గం దృష్టికి తీసుకువెళ్లారు. గ్రాడ్యుయేట్ శాసనమండలి ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన అభ్యర్థిత్వంపై తుది నిర్ణయం జనసేన పార్టీ అధిష్టానం తీసుకోవాల్సి ఉంది. పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకటించిన అనంతరం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టే అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి పరివార దేవతల పునఃప్రతిష్ఠ



## - మహోత్సవంలో భాగంగా ఘనంగా దేవతామూర్తుల ఊరేగింపు

**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని శ్రీ పాండురంగ భజన మందిరం ప్రాంగణంలో పర్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి పరివార దేవతల పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శనివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.మహోత్సవంలో భాగంగా శ్రీ పర్వత వర్ధిని అమ్మవారు, గణపతి, ద్వారపాలకులు, నందీశ్వరుడు, జీవధ్వజ, పంచాయతన దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భజన మందిరం నుంచి దేవతామూర్తుల ఊరేగింపును ఘనంగా చేపట్టారు.మంగళ వాయిద్యాలు, కోలాటాలతో సాగిన ఊరేగింపు గాజుల రాజాం బస్తీ, కూలీ లైన్, రైతుబజార్, ఎంజీ రోడ్డు, పెద్దబజార్, సూర్య ప్యాలెస్ మీదుగా తిరిగి శ్రీ పాండురంగ భజన మందిరానికి



చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సులోచన, మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ బండారి, తిరుపతి, వాసు, మనోహర్, గాజుల శ్రీనివాసు, అర్చకులు శ్రీ వేదుల రామచంద్రమూర్తి, ఆలయ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్‌కు గోల్డ్ మెడల్

## - సూపర్ బిగ్ బోర్ రైఫిల్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తొలి పతకం

**చుంచుపల్లి, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

తెలంగాణ రైఫిల్ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆక్టోపస్ కమాండో శిక్షణ కేంద్రంలో ఆగస్టు 20, 21 తేదీల్లో నిర్వహించిన రైఫిల్ షూటింగ్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూనియర్ షూటర్ అయ్మాన్ ముస్కాన్ పఠాన్ సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 100 పాయింట్లకు గాను 98 పాయింట్లు సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు.సూపర్ బిగ్ బోర్ రైఫిల్ విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తొలి పతకం లభించడం విశేషమని క్రీడా వర్గాలు పేర్కొన్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన జూనియర్ షూటర్ జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన పోటీలో ప్రతిభ కనబరచడం జిల్లాకు గర్వకారణంగా నిలిచిందని అభినందించారు.విజేత అయ్మాన్ ముస్కాన్ పఠాన్‌కు బంగారు పతకాన్ని మాజీ డీజీపీ అంజనీ కుమార్, తెలంగాణ రైఫిల్ సంఘం అధ్యక్షుడు, జాతీయ రైఫిల్ సంఘం ఉపాధ్యక్షుడు అమిత్ సంఘీ చేతుల మీదుగా అందజేశారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తక్కువ కాలంలోనే రైఫిల్ షూటింగ్ శిక్షణను అందుబాటులోకి తీసుకొచ్చి, ప్రతిభావంతులైన క్రీడాకారులకు శిక్షణనిస్తూ మంచి షూటర్లుగా తీర్చిదిద్దుతున్న కోచ్ అబ్దుల్ నబీ కృషిని డీవైఎస్ఓ పరంధామ రెడ్డితో పాటు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు. జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కోచ్‌కు అభినందనలు తెలిపారు.

# బడుగు, బలహీన వర్గాల గొంతుక సురవరం



## - ఆయన ఆశయ సాధనకు పునరంకితం కావాలి: ఎస్కే ఫహీం

**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

కమ్యూనిస్టు ఉద్యమాల్లో చెరగని ముద్ర వేసిన సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్కే ఫహీం పిలుపునిచ్చారు.సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నివాళి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫహీం మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న సురవరం.. కార్మికులు, కర్షకులు, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడారని అన్నారు. ఎంపీగా పార్లమెంటులో ప్రజా సమస్యలను బలంగా వినిపించారని, వామపక్ష ఐక్యత కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన నిరాడంబర జీవనం, సిద్ధాంత నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు గెడ్డాడు నగేష్, నేరెళ్ల రమేష్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, నాయకులు ఎండీ యూసుఫ్, గోపీకృష్ణ, ధర్మరాజు, మిర్యాల రాము, షహీన్, కైసర్, మేదిని లక్ష్మి, చోటు షరీఫ్, ఆఫ్జల్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ బండారి రుక్మాంగాధర్ ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు



**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను కొత్తగూడెం పట్టణంలోని గాజుల రాజాం బస్తీలో చిరంజీవి అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. బాలీ నర్సింహా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ కౌన్సిలర్ బండారి రుక్మాంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అభిమానులకు కేక్, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చిరంజీవి సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడంతో పాటు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వేమూనూరి శివ, రాష్ట్ర చిరంజీవి ఫ్యాన్స్ ప్రెసిడెంట్ విల్సన్ బాబు, రజని, ఖాళీ తిరుపతి, ప్రవీణ్, నవీన్‌తో పాటు పలువురు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

# రుద్రంపూర్ జయశంకర్ వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి శ్రీకారం

## - ప్రజల ఆరోగ్యం, యువత క్రీడాభివృద్ధికి దోహదం: ఎండీ రజాక్



**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

సింగరేణి కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ అన్నారు.
గ్రౌండ్‌లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలు, వాకర్స్, క్రీడాకారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.యువత చెడు మార్గాలకు దూరంగా ఉండేందుకు క్రిడలు ఎంతో దోహదపడతాయని, క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని రజాక్ తెలిపారు. వాకర్స్, క్రీడాకారులు, క్రికెటర్లు, అభిమానులకు ఇబ్బందులు కలగకుండా ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.రుద్రంపూర్ ప్రాంత అభివృద్ధిలో వాకింగ్ ట్రాక్ మరో ముందడుగు అని, జయశంకర్ గ్రౌండ్ అభివృద్ధికి స్థానికులు, క్రీడాకారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం. కొమురయ్య, ఈ. మోహన్‌రెడ్డి, ఎండీ సత్తార్ పాషా, మల్లికార్జున్, త్రిపాఠి, హనుక్‌రాజ్, సత్యనారాయణ, హనుమంతరావు, దశరథం, రవి, నాగేశ్వరరావు, శ్రీనివాస్, శివజయపాల్, సంజీవ్, విజయ్, సంజయ్‌తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

## ప్రభుత్వ విధానాలను ఉపసంహరించుకోవాలి: ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్




**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**

పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది డిప్లొమా విద్యార్థుల విద్యా, ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని అన్నారు.డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యలో అవకాశాలు కల్పించే లాటరల్ ఎంట్రీ విధానాన్ని రద్దు చేయవద్దని కోరారు. విద్యార్థులకు నష్టం కలిగించే శక్తి స్కీమ్‌తో పాటు జీవో నంబర్ 97ను కూడా వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే విధానాలపై ప్రభుత్వం విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ దీక్షకు సైతం సిద్ధమని అజిత్ హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, నాయకులు సలిగంటి జయదీప్, ముదిగొండ నిరీక్షణ, ప్రియాంషీ, సాయి కృష్ణ, నీలాద్రి, బండి హనీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెనగడప వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

**- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సిబ్బందికి సూచనలు**





**చుంచుపల్లి, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
మండలంలోని పెనగడప గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రతాప్తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ప్రయోగశాల, ఫార్మసీ, వార్డు, ఐఎల్ఆర్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రి రికార్డులు, హాజరు రిజిస్టర్, సెలవు వివరాలు, వివిధ లేఖలు తదితర పత్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. అనంతరం పెనగడప గ్రామంలో నిర్వహించిన దోమల నివారణ మందు పిచికారీ కార్యక్రమంలో అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, దోమల నియంత్రణ చర్యలను నిరంతరం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పెనగడప వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య చర్యలు

**తల్లాడలో ముందస్తుగా హెల్త్ క్యాంపులు**




**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు తల్లాడ గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ కార్యక్రమాన్ని సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధులు, మురుగు కాలువలు, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు, కలుషిత నీటి కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ముందస్తుగా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మ రెడ్డి, మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ధూపాటి భద్రరాజు, ఈవో శ్రీహరిక్రిష్ణ, వార్డు మెంబెర్ సరికొండ శ్రీనివాస రాజు, పెరిక కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ 13వ వార్షికోత్సవ సభ విజయవంతం

**క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి: టీసీసీ నాయకులు**



**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ (టీసీసీ) 13వ వార్షికోత్సవ సభ ఖమ్మం జిల్లాలోని మంచికంటి భవన్లో శనివారం ఘనంగా నిర్వహించారు. టీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎస్. కిరణ్కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో రాష్ట్రవ్యాప్తంగా పలువురు క్రైస్తవ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడంతో పాటు ఆర్థికంగా సహకరించాలని కోరారు. క్రైస్తవుల సంక్షేమానికి టీసీసీ రాష్ట్ర కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. టీసీసీ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ ఎం.డి. సుదర్శనం మాట్లాడుతూ క్రైస్తవులకు కూడా ఎస్సీ, బీసీలకు అందిస్తున్న తరహాలో ప్రభుత్వ పథకాల కింద రుణాలు, సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. నిరక్షణరావు, పి. యేసుదాసు, సీహెచ్. రమేష్బాబు, జార్జి ముల్లర్, ఎస్. డేవిడ్రాజు, టి. మధుసూదన్, టీ. ఆనందరావు, జిల్లా సభ్యులు జీ. బాబురావు, రాజారత్నం, అద్భుతకుమార్, ఖమ్మం పట్టణ నాయకులు పి. జేకర్యా హనుమంతరావు, వేముల సత్యం, పాల్ సంజీవరావు, ఆనందరావు, బి. పాల్, కె.వి. ఇజ్రాయిల్, దేవసహాయం, దైవసేవకులు తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను లెక్కచేయని యాజమాన్యం




**- కాంట్రాక్టు కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాడాలి: ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకుడు సీతారామయ్య**

**కొత్తగూడెం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టం, సుప్రీంకోర్టు తీర్పు ఉన్నప్పటికీ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు సమాన వేతనాలు అందడం లేదని ఐఎఫ్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. సీతారామయ్య ఆరోపించారు. కోల్ ఇండియా ఒప్పందం ప్రకారం హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయడంలో యాజమాన్యం విఫలమైందని విమర్శించారు. సెప్టెంబర్ 1న కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్లో నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలోని హాస్పిటల్, బాబు క్యాంపు, బర్మా క్యాంపు, నర్సు క్వార్టర్స్ ప్రాంతాల్లో గేట్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు.
కాంట్రాక్టు కార్మికులు ప్రమాదాలకు, అనారోగ్యానికి గురైనప్పుడు సింగరేణి ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల శ్రమదోపిడీకి వ్యతిరేకంగా, చట్టాల అమలు కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1న జరిగే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రీజియన్ కార్యదర్శి నెమిల్ల సంజీవ్ అధ్యక్షత వహించారు. పుష్పరాజు, రాధా, లలిత, విజయ, కుమారి, సంజీవరావు, లక్ష్మి, రమణ, పుష్ప, వెంకటేశ్వర్లు, జకరయ్య, నిర్మల, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి చిన్నారికి భద్రమైన బాల్యాన్ని అందించడం మనందరి బాధ్యత

**- గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై పాఠశాలల్లో విస్తృత అవగాహన కల్పించాలి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు**





**ఖమ్మం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయ సేవల పథకం-2024లో భాగంగా బాలల సంరక్షణ అధికారులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలు, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై పిల్లలకు అర్థమయ్యేలా అవగాహన కల్పించి, అనుచిత స్పర్శను గుర్తించి వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేసేలా ధైర్యం కల్పించాలన్నారు. పిల్లల ప్రవర్తనలో భయం, ఒంటరితనం, ఆందోళన వంటి మార్పులను ఉపాధ్యాయులు నిశితంగా గమనించాలని సూచించారు.
బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, పిల్లలపై వేధింపుల విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని తెలిపారు. బాలల సంరక్షణను ఉద్యోగ బాధ్యతగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి పనిచేయాలని కోరారు. కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు కొత్త రూపు సంతరించుకుంటున్నాయని అన్నారు. జువైనల్ జస్టిస్ యాక్ట్, పోక్సో చట్టం తదితర నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసి ప్రతి చిన్నారికి సురక్షిత వాతావరణం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి విష్ణువందన, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, బాలల సంరక్షణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీటి కుంటల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్..





**ఖమ్మం, కూసుమంచి, ఆగస్టు:22 (తెలంగాణ వాణి):**
రైతుల పొలాల్లో నిర్మిస్తున్న నీటి కుంటలు (ఫారం పాండ్లు) భూగర్భ జలాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం కూసుమంచి మండల కేంద్రానికి చెందిన రైతు అర్వపల్లి వెంకటేశ్వర్లు పొలంలో నిర్మిస్తున్న నీటి కుంటను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రధాన రహదారి నుంచి సుమారు 600 మీటర్ల మేర డొంక రహదారిలో నడుచుకుంటూ వెళ్లి నీటి కుంట నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నీటి కుంటల నిర్మాణం వల్ల వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు, ఆ నీరు భూమిలోకి ఇంకి సమీపంలోని బోర్లు, బావుల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని అన్నారు. నీటి నిల్వలు పెరగడం వల్ల భవిష్యత్తులో మత్స్య సంపద అభివృద్ధికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు తమ పొలాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నీటి కుంట నిర్మాణం, పనుల పురోగతి, రైతులకు కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వివరాలు తెలుసు కున్నారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి తహసీల్దార్ సైదులు, గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి, గ్రామపంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, తదితరులు, పాల్గొన్నారు...

# ఖిల్లా రోప్వే పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలి

**- నాణ్యత, భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి: కలెకర్ దివాకర టీఎస్**





**ఖమ్మం, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
ఖమ్మం ఖిల్లా రోప్వే నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఖిల్లా రోప్వే నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిపై అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు ఆశించిన వేగంతో సాగడం లేదని, అవసరమైన మెటీరియల్ను ముందస్తుగా సమకూర్చుకుని పనుల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. రోప్వే నిర్మాణంలో నాణ్యత, భద్రత విషయంలో రాజీ పడవద్దని స్పష్టం చేశారు. ఖిల్లా ప్రాంతంలోని షీట్రాక్ పరిస్థితుల నేపథ్యంలో జియాలజిస్ట్తో సమన్వయం చేసుకుని అవసరమైన భౌగోళిక, సాంకేతిక పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

**ఖిల్లాపై పర్యాటక సౌకర్యాల అభివృద్ధి**

ఖమ్మం ఖిల్లాకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక సౌకర్యాలు, పర్యాటక కార్యక్రమాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. స్టార్గేజింగ్ కోసం టెలిస్కోప్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, పర్యాటకుల కోసం క్యాంటీన్ ఏర్పాటు చేయాలని అన్నారు. వాహనాల పార్కింగ్కు అనువైన స్థలాన్ని తహసీల్దార్ గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, ఇంజినీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో సంక్షేమ పథకాలు మరింత సులభం



**అచ్చంపేట, ఆగస్టు 22(తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి ):**
అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు అందిం చడమే ప్రభుత్వ లక్ష్యమని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట నియో జక వర్గంలోని అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎంకే గార్డెన్ ఫంక్షన్హాల్లో శనివారం నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పం పిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్డులు క్యూఆర్ కోడ్, వాటర్ప్రూఫ్తో పాటు పలు భద్రతా ఫీచర్లను కలిగి ఉంటాయని తెలిపారు. గతంలో రేషన్ కార్డులు లేక సంక్షేమ పథకాలు పొందలేకపో యిన వారికి ఇక ఇబ్బందులు ఉండవన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని చెప్పారు. సన్న బియ్యం పథకంతో పేదలకు నాణ్యమైన బియ్యం అందిస్తు న్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# టీసీసీ మీడియా అధ్యక్షులుగా నారపోగు ప్రసాద్




**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి) :**
తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ మీడియా జిల్లా అధ్యక్షులుగా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన నారపోగు ప్రసాద్ ను ఎన్నుకొన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన టిసిసి 13వ వార్షికోత్సవ సభలో ఆయనను జిల్లా అధ్యక్షులుగా ప్రకటించారు. ఈ సందర్భంగా టిసిసి వ్యవస్థాపక అధ్యక్షులు మానుకొండ సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో టిసిసి బలోపేతం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర టిసిసి ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మెగా యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ జన్మదిన వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఎల్ఏ నియోజకవర్గ ఇన్చార్జి రాయల రాము**



**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
తల్లాడ మండల కేంద్రంలో మెగా యూత్ ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ బీఎల్ఏ ఇన్చార్జి, కాంగ్రెస్ నాయకులు రాయల రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మెగా అభిమానులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం రాయల రాము మాట్లాడుతూ స్వయంకృషితో సినీ రంగంలో అంచెలంచెలుగా ఎదిగిన చిరంజీవి తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించుకుని, ఇండస్ట్రీకి పెద్దదిక్కుగా నిలిచారని కొనియాడారు. చిరంజీవి సినీ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
కార్యక్రమంలో తల్లాడ మండల మాజీ జడ్పీటీసీ మూకర ప్రసాద్, మంగాపురం ఉపసర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ, వేమిశెట్టి శంకర్తో పాటు మెగా అభిమానులు, మెగా యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
ఆదివారం , 23 - 8 -2026

# త్వరలో సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడకు గోదావరి జలాలు

### - చెరువులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి):**
సీతారామ ప్రాజెక్టులో భాగంగా సిరిపురం మేజర్ కాలువ ద్వారా తల్లాడ మండలానికి గోదావరి జలాలు త్వరలో అందనున్నాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం తల్లాడ మండలంలోని చెరువులను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ సిరిపురం మేజర్ కాలువ మరమ్మతుల కారణంగా గోదావరి జలాల విడుదలకు అంతరాయం ఏర్పడటంతో మండలంలోని రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. దీనిపై స్పందించిన నీటిపారుదల శాఖ సిరిపురం మేజర్ కాలువ పనులను తాత్కాలికంగా నిలిపివేసి, లక్ష్మీనగర్ వరకు కాలువ పనులు పూర్తిచేసి నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. దీంతో అన్నారుగూడెం, బిల్లుపాడు, వెంకటగిరి, గోపాలపేట, తల్లాడ, తెలగవరం, గొల్లగూడెం, అంజనాపురం ప్రాంతాల రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.గోదావరి జలాల విడుదలకు సహకరించిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో పాటు నీటిపారుదల శాఖ అధికారులకు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో తెలగవరం సర్పంచ్ భూక్య కాలోజీ, అన్నారుగూడెం మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, బండి బాలసౌరి, ఉప్పెల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# గంగాదేవి పాడు సొసైటీ పరిధిలో రైతులు ఆందోళన

**తల్లాడ, ఆగస్టు 22 (తెలంగాణ వాణి) :**
మండల పరిధిలో గంగిదేవిపాడు సొసైటీ పరిధిలోని రైతులు తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో రసాయనక ఎరువుల సాంకేతిక లోపాల్ని సవరించి ఆరు రోజుల నుంచి గోడౌన్ లో ఉన్న ఎరువులను రైతులకు వెంటనే అందించాలని సహకార సంఘం ఆఫీసుకు తాళం వేసి నిరసన తెలియజేశారు వెంటనే స్పందించిన సంబంధిత అధికారులు సమస్యను రేపు ఉదయం వరకు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు కళ్యాణపు కృష్ణయ్య మాట్లాడుతూ గత ఆరు రోజుల నుంచి సాంకేతిక సమస్యను పరిష్కరించకుండా అధికారుల నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఫలితంగా గోడౌన్ లో ఉన్న రసాయనక ఎరువులు రైతులకు అందని ఫలితంగా రైతులు నిరసనకు దిగాల్సిన పరిస్థితి వచ్చిందని ఇప్పటికైనా పై అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇప్పటికే పట్టాదారు పాస్ పుస్తకం లేని చిన్న సన్న కారు రైతులు కౌలు రైతులకు ఎరువులు అందటం లేదని భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని అన్నారు రైతుల ఆందోళన గుర్తించి వెంటనే స్పందించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు మండలంలోని రైతులందరికీ రసానిక ఎరువులు ఆన్లైన్



విధానాన్ని తొలగించి ఎరువులు అందించాలని లేనిపక్షంలో ఈ సమస్యపై మండల వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కర్లకంత శ్రీనివాసరావు, కళ్యాణపు వెంకటేశ్వరరావు, శెట్టిపల్లి లక్ష్మణరావు, నాయుడు శ్రీనివాసరావు, కాపా బాబు, పర్వతం నరసింహారావు, షేక్ అక్బర్, అత్తులూరి శ్రీనివాసరావు, అడపా సురేష్, గండమాల ఆనందరావు, పొర్ల హనుమంతు, నలజాల శ్రీనివాసరావు, ఎక్కిరాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

RNI NO. APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
ఆదివారం , 23 - 8 -2026

## కొత్తగూడెం ప్రెస్ క్లబ్‌లో షోయబుల్లా ఖాన్ వర్ధంతి వేడుకలు



**కొత్తగూడెం (సూర్యోదయ వార్త)**

కొత్తగూడెం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు, అమరుడు షాయబుల్లా ఖాన్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్‌లో షాయబుల్లా ఖాన్ చిత్రపటానికి జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రజా సమస్య లను వెలుగులోకి తీసుకురావడంలో, నిజాలను నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకురావడంలో షాయబుల్లా ఖాన్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. పాత్రికేయ రంగంలో ఆయన చూపిన ధైర్యం, నిబద్ధత నేటి జర్నలిస్టులకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను నిర్భయంగా వెల్లడిం చడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సాక్షి స్టాఫర్ గోవింద్, ఐన్యూస్ ఇన్ పుట్ ఎడిటర్ నవీన్, వెలుగు స్టాఫర్ రాజేందర్, మన తెలంగాణ స్టాఫర్ సత్య ప్రకాష్, విజన్ ఆంధ్ర స్టాఫర్ ఉమాకాంత్, వుదయం స్టాఫర్ జీవన్, సీనియర్ పాత్రికేయులు మోటమర్రి రామకృష్ణ, జునుమాల రమేష్, రెశ్వంత్ పండుగ, రిపోర్టర్స్ ఏర్పుల సుధాకర్, కొండా జంపన్న, కవటం శ్రీనివాస్, కోల కుమార్, బిగ్ టీవీ నాగేశ్వరావు, సీవీఆర్ రమేష్, అఫ్జల్ పఠాన్ పాల్గొని షాయబుల్లా ఖాన్ సేవలను స్మరించుకున్నారు.

## విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం : కొల్లి ఫౌండేషన్



**ములకలపల్లి, (సూర్యోదయ వార్త):**

విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందిం చడమే లక్ష్యంగా కొల్లి ఫౌండేషన్ పనిచేస్తోందని నిర్వాహకులు తెలిపారు. ములకలపల్లి మండలం తిమ్మంపేట ప్రాథమికో న్నత పాఠశాల విద్యార్థులకు శనివారం కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. సర్పంచ్ తుర్రం శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు బ్యాగులు అందజేశారు. గతంలో పాఠశాలలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో విద్యార్థులకు బహుమతులు అందించిన ఫౌండేషన్, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మరింత సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది బ్యాగులను పం పిణీ చేసింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. శంకర్ సూ చన మేరకు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కొల్లి కల్పనా చౌదరి స్పందించి ఈ సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. శంకర్ మాట్లాడుతూ, మరింత మంది దాతలు ముందుకు వచ్చి పాఠశాల, విద్యార్థుల



అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూప్లా నాయక్, గ్రామ కమిటీ చైర్మన్ డా. వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ సాయిబాబా, ఉపాధ్యా యులు నిర్మల, సురేష్, ప్రశాంత్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.